# నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు

- భారీ క్రేన్ల ఏర్పాటు
- ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసు బందోబస్తు
- ఆరోగ్య శిబిరం, హెల్ప్‌లైన్ సెంటర్ల ఏర్పాటు
- చెరువుల వద్ద మౌలిక సదుపాయాలు


షాద్‌నగర్‌టౌన్ : బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏసీపీ రంగస్వామి, సీఐ తదితరులు

తుర్కయాంజాల్, సెప్టెంబర్ 16 : మంగళవారం జరిగే వినాయక నిమజ్జనాలకు తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసబ్ చెరువు వద్ద మున్సిపల్ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మాసబ్ చెరువు కట్టపై లైటింగ్‌ను ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు గణేశుల నిమజ్జనానికి రెండు భారీ క్రేన్‌లతో పాటుగా ఒక హిటాచీ సైతం సిద్ధంగా ఉంచారు. గడిచిన 8 రోజుల్లో సుమారు 1500లకు పైగా వినాయక ప్రతిమలు నిమజ్జనం కాగా మంగళవారం ఒక్క రోజే సుమారు 2000లకు పైగా విగ్రహాలు నిమజ్జనం కోసం మాసబ్ చెరువుకు రానున్నాయి. భారీ విగ్రహాలకు ఒకటి, 4 ఫీట్ల లోపు విగ్రహాలకు మరొక నిమజ్జన పాయింట్లను ఏర్పాటు చేశారు. మూడు షిఫ్టులలో మున్సిపల్ సిబ్బంది పాల్గొననున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదిబట్ల పోలీసులు మాసబ్ చెరువు వద్ద పహారా కాస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు 120 మంది మున్సిపల్ సిబ్బంది మూడు షిఫ్టులలో విధులు నిర్వహించనున్నారు. భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా 40, 20 టన్నుల క్రేన్‌లు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. విగ్రహాలను తొలగించడానికి ఇటాచీ కూడా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. భక్తుల కోసం ఆరోగ్య శిబిరం, హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.


తుర్కయాంజాల్ : మాసబ్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్

### గజ ఈతగాళ్లు అందుబాటులో..

షాద్‌నగర్‌టౌన్ : గణపయ్యను నిమజ్జనం చేసేందుకు షాద్‌నగర్ మున్సిపాలిటీలోని బొబ్బిలి చెరువు, ఫరూఖ్‌నగర్ మండలం బుచ్చిగూడ గ్రామ సమీపంలోని పెరుమాళ్ల కుంట చెరువు వద్ద అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంతోపాటు మండలంలో నెలకొల్పిన గణనాథులను ఈ చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. చెరువుల వద్ద క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ దీపాలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న పరిశీలించారు. గణేశ్ నిమజ్జనాన్ని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, అధికారులు, పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా పట్టణంలో సుమారు 150 మంది పోలీసులతో బందోబస్తు చేశామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు.

### గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

యాచారం/ఇబ్రహీంపట్నం రూరల్ : గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ నరసింహారావు, ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణేశ్ ఊరేగింపులో ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతులు లేవన్నారు. ఊరేగింపులో అల్లర్లు, గొడవలు చోటుచేసుకోకుండా ఉత్సవ నిర్వాహకులు చూడాలన్నారు. ఊరేగింపులో చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. గణేశ్ శోభాయాత్ర సమయంలో వేలాడే విద్యుత్ తీగలను జాగ్రత్తగా గమనించాని, లేకపోతే విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని చెప్పారు. రాత్రి పూట నిమజ్జనం సమయంలో చిన్నారులను చెరువులు, కుంటల వద్దకు అనుమతించవద్దన్నారు. గణేశ్ ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ


కొత్తూరు : ఇన్ముల్‌నర్వా దర్గాలో దట్టి చాదర్‌ను సమర్పించేందుకు వచ్చిన ముస్లింలు

కొత్తూరు, సెప్టెంబర్16 : కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వా గ్రామంలోని జేపీ దర్గాలో ముస్లిం మత పెద్దలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దట్టి చాదర్‌ను బాబాలకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### సర్వమానవాళి శ్రేయస్సే అల్లా ధ్యేయం

ఆమనగల్లు : మానవులంతా ఒక్కటేనని.. తారతమ్య భేదం లేకుండా శాంతి, సహజీవనం, దానం, దైవ భీతితో మెలగాలని మహ్మద్ ప్రవక్త బోధించారని ప్రతిఒక్కరూ ఆ దిశలో పయనించాలని మత గురువు అబ్దుల్ వాహిద్ కోరారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆమనగల్లులో మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జామా మసీద్, హైమద్ హిలాల్ మసీద్, మహ్మదీయ మసీద్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు, దువ్వాలులు నిర్వహించి జాగరణ చేశారు. కార్యక్రమంలో మసీదుల అధ్యక్షులున్నారు.


ఆమనగల్లు : ముస్లింలనుద్దేశించిన మాట్లాడుతున్న మత గురువు అబ్దుల్ వాహిద్

### సమాజ సేవలో భాగస్వాములు కావాలి


నీటి శుద్ధి కేంద్రానికి భూమి పూజ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

కడ్తాల్, సెప్టెంబర్ 16 : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న నీటి శుద్ధి కేంద్రానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. సేవా కార్యక్రమాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలంయాదవ్, నాయకులు పాల్గొన్నారు.


సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఆమనగల్లులో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొని నివాళులర్పించారు.
- ఆమనగల్లు, సెప్టెంబర్ 16


మృతుడు ఇబ్రహీం

### చెక్‌డ్యామ్‌లో నీట మునిగి యువకుడు మృతి

షాబాద్, సెప్టెంబర్ 16 : వినాయక నిమజ్జనం కోసం చెక్ డ్యామ్‌లోకి వెళ్లిన ఓ యువకుడు నీటమునిగి మృతిచెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన ఇబ్రహీం(32) ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు స్నేహితులతో కలిసి చందనవెల్లి గ్రామ శివారులో గల వాగులో వినాయకుడిని నిమజ్జనం చేశారు. తర్వాత అదే వాగులో కొద్ది దూరంలో ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు స్నానం చేసేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. స్నానానికి వెళ్లిన ఇబ్రహీం అందులో ఈత కొట్టేందుకు దూకాడు. దూకిన వ్యక్తి తిరిగి పైకి రాలేదు. స్నేహితులు ఎంత వెతికినా అతడి ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం ఉదయం చెక్ డ్యామ్ వద్దకు వెళ్లి చూడగా ఇబ్రహీం మృతదేహం పైకి తేలింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు లింగయ్య

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

షాబాద్, సెప్టెంబర్ 16: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని నాగరగూడ చౌరస్తాలో జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి కథనం ప్రకారం.. నాగరగూడ గ్రామానికి చెందిన ఎర్రవల్లి లింగయ్య(60) సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఓ లారీ షాద్‌నగర్ వైపు నుంచి చేవెళ్ల వైపు వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న లింగయ్యను ఢీకొట్టింది. గమనించిన స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని కేర్ దవాఖానకు తరలించారు. అప్పటికే లింగయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మాచారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గోవింద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి బామ్మర్ది బీరప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చేవెళ్లటౌన్ : 5లక్షల51రూపాయలకు లడ్డూను దక్కించుకున్న బురాన్ బ్రదర్స్


మొయినాబాద్ : సురంగల్‌లో వినాయకుడి లడ్డూలను కైవసం చేసుకున్నవారు

# గంగమ్మ ఒడికి గణనాథుడు


మొయినాబాద్ : సురంగల్‌లో మహారాష్ట్ర డోలువాయిద్యాలతో నిమజ్జన ర్యాలీ

### ఘనంగా వినాయక నిమజ్జనాలు
### భారీగా పలికిన లడ్డూ వేలం పాటలు

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు చోట్ల వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు విశేష పూజలందుకున్న పార్వతి తనయుడు గణపయ్య భారీ ఊరేగింపు మధ్య గంగమ్మ ఒడికి చేరాడు. ఈ సందర్భంగా బ్యాండు వాయిద్యాలు, యువత నృత్యాలు, మహిళల కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. నిమజ్జన నేపథ్యంలో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, లడ్డూల వేలం పాటలు, ఉట్ల కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం చేశారు. లడ్డూలను దక్కించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా లడ్డూలను దక్కించుకున్నవారిని సన్మానించారు. వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

- రంగారెడ్డి జిల్లా న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

## లడ్డూ వేలం పాటల వివరాలు

* చేవెళ్లలోని అంబేద్కర్‌నగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూను 5లక్షల51 రూపాయలకు బురాన్ బ్రదర్స్ దక్కించుకున్నారు.
* అంబేద్కర్ కాలనీలో పోచమ్మ గుడి వద్ద ప్రతిష్ఠించిన గణేశ్ లడ్డూను రూ.32,50,001లకు పొట్ట రమేశ్, కొజ్జెంకి యాదయ్య, గంగి యాదయ్య
* రజకనగర్ కాలనీలో లడ్డూను 4లక్షల ఒక్క రూపాయికి శివకుమార్
* మల్లికార్జున కాలనీలో 3లక్షల11వేల రూపాయలకు గాల రెస్టారెంట్
* న్యూ జర్నలిస్టు కాలనీలో సీనియర్ జర్నలిస్ట్ కడమంచి ఆనంద్ రూ.40వేలకు
* సురంగల్‌లోని విశాలయం వద్ద రూ.1.50లక్షలకు కందికొండ మల్లేశ్‌గౌడ్
* ఎల్లగని బాబయ్య ఇంటి వద్ద రూ.50వేలకు నిర్దుల ప్రభాకర్‌రెడ్డి
* బేగరి యాదయ్య ఇంటి వద్ద రూ.46వేలకు ఎల్లగని శివశంకర్‌గౌడ్
* గోదాం వద్ద రూ.51వేలకు వినాయక ఉత్సవ కమిటీ
* వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రూ.14,600లకు పిచ్చకుంట్ల శ్రీనివాస్
* శివాజీ యూత్ అసోసియేషన్ లడ్డూను రూ.16,500లకు ఎల్లగని సురేందర్‌గౌడ్
* 8వ వార్డులో రూ.35వేలకు ఉప్పరి నారాయణసాగర్
* యాదవ సంఘం భవనంలో రూ.35,800లకు కొండేటి కొమురయ్య
* షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆనంద్‌నగర్ కాలనీ పార్కులో లడ్డూలను రూ.5.35లక్షలకు మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు
* 9వ వార్డు శంకర్‌నగర్‌కాలనీలో రూ.1,45,116లకు రమేశ్‌గౌడ్
* తుర్కయాంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పాటిగూడలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో రూ.3,61,000లకు బద్దం శేఖర్‌రెడ్డి
* సాగర్ ఎన్‌క్లేవ్‌లో రూ.1,11,111లకు ధర్మారెడ్డి
* పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీలో రూ.45వేలకు మహేశ్, రూ.47వేలకు వెంకట్‌రెడ్డి, మారుతీనగర్‌లో రూ.35,600లకు రమేశ్‌గౌడ్, స్వర్ణగౌడ్
* కడ్తాల్ మండలం మైసిగండిలోని పెద్ద వినాయకుడి వద్ద రూ.3.5లక్షలకు రమేశ్‌నాయక్
* మైసమ్మ వినాయకుడి వద్ద రూ.1.2లక్షలకు కల్యాణ్‌సింగ్
* హనుమాన్ ఆలయం వద్ద రూ.1.1లక్షలకు రాజారాంనాయక్
* ముత్యాలమ్మ ఆలయం వద్ద రూ.రూ.1.21లక్షలకు శంకర్
* దేపావత్ గుడి వద్ద రూ.1.2లక్షలకు కృష్ణ
* విస్లావత్ వినాయకుడి వద్ద రూ.1.10 లక్షలకు నరేశ్
* సభావట్ గణనాథుడి వద్ద రూ.లక్షకు శ్రీను
* పదుశ్రీ పార్యడైజ్ వద్ద రూ.1.32లక్షలకు జవహర్‌లాల్
* రావిచేడ్ గ్రామంలో రూ.56వేలకు మాజీ ఎంపీటీసీ గోపాల్
* అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామం నవయువక్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో రూ.1.32లక్షలకు మాజీ వార్డు సభ్యుడు, డీజే సౌండ్ దాత గుండె నర్సింహ
* శంకర్‌పల్లి మండలం రావులపల్లి కలాన్‌లోని వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.67వేలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీరాములుగౌడ్
* చేవెళ్ల మండలం కందవాడలోని హనుమాన్ టెంపుల్ వద్ద రూ.లక్షా7వేలకు సీనియర్ న్యాయవాది గౌండ్ల కృష్ణగౌడ్
* గుండాల గ్రామంలోని రచ్చబండ వద్ద రూ.2,01,100కు గంగిడి జంగారెడ్డి జెన్నమ్మ దంపతులు


షాద్‌నగర్‌టౌన్ : లడ్డూలను దక్కించుకున్న మనోజ్‌కుమార్, కీర్తన దంపతులు


పెద్దఅంబర్‌పేట : లడ్డూతో స్వర్ణగౌడ్


అబ్దుల్లాపూర్‌మెట్ : మాజీ వార్డు సభ్యుడు గుండె నర్సింహా


తుర్కయాంజాల్ : లడ్డూతో శేఖర్‌రెడ్డి


కడ్తాల్ : మైసిగండిలో లడ్డూతో రమేశ్‌నాయక్


చేవెళ్లరూరల్ : గంగిడి జంగారెడ్డి జెన్నమ్మ దంపతులు

# గొంతు నులిమి హత్య

### మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాసరావు

కొత్తూరు, సెప్టెంబర్ 16 : భర్త ఊరికి వెళ్లడంతో అతడి స్నేహితుడు ఇంటికి వచ్చి భార్యపై అత్యాచారయత్నం చేయగా.. ఆమె ఒప్పుకోకపోవడంతో గొంతు నులిమి హత్య చేసిన సంఘటన ఈ నెల 12న కొత్తూరులో జరిగింది. సోమవారం కొత్తూరు పోలీసులు కేసు మిస్టరీని ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు కొత్తూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వా గ్రామానికి చెందిన యాదమ్మ(45) కొత్తూరులో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీ పని చేస్తూ జీవనోపాధి పొందేది. ఈ నేపథ్యంలో యాదమ్మ భర్త రామారావు, అతడి స్నేహితుడు బాబూరావు అడ్డాకూలీలుగా పనిచేసేవారు. రామారావు ఇటీవలే తన గ్రామానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాబూరావు యాదమ్మకు మద్యం తాగించి అత్యాచార యత్నం చేశాడు. అమె ఒప్పుకోకపోవడంతో విషయం బయట తెలుస్తుందనే భయంతో బాబూరావు యాదమ్మను గొంతు నులిమి చంపేశాడు.


కేసు వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు

యాదమ్మ కుమార్తె రేణుక అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కొత్తూరు సీఐ నరసింహారావు హత్య కింద కేసు నమోదు చేశారు. పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. సోమవారం బాబూరావును అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. హత్య కేసును నాలుగు రోజుల్లో ఛేదించిన శంషాబాద్ ఏసీపీ శ్రీనివాసరావు కొత్తూరు సీఐ నరసింహారావు, ఎస్ఐ జె.శ్రీనివాస్, కానిస్టేబుల్ రవీందర్, కుమార్, మహిపాల్‌లను అభినందిస్తూ రివార్డులు అందజేశారు. హత్యకు పాల్పడ్డ బాబూరావును రిమాండ్‌కు తరలించారు.

### సొంత డబ్బులతో గుంతలు పూడ్చారు

మొయినాబాద్, సెప్టెంబర్ 16 : హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామానికి ఉన్న లింక్ రోడ్డు వర్షాలకు పూర్తిగా గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. రాత్రి సమయంలో ఆ రోడ్డుపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాల బారిన పడుతున్న విషయం తెలుసుకున్న సీనియర్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు మర్రి రవీందర్‌రెడ్డి స్వచ్ఛందంగా ముందుకొచ్చి సుమారు 1.5 కిలోమీటర్ దూరం వరకు గుంతలుగా మారిన రోడ్డుపై మొరం పోసి చదును చేయించారు. దీంతో గ్రామస్తులు రవీందర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్న ఊరుకు కొంత సాయం చేయాలనే ఆలోచనతో ప్రజలు నిత్యం ప్రయాణిస్తున్న రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టి పోసి చదును చేయాలని ముందుకు రావడం జరిగిందని, గ్రామ ప్రజల కోసం సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు.

### నేత్రదానం చేయండి


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్

ఆమనగల్లు, సెప్టెంబర్ 16 : నేత్రదానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆమనగల్లులోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, రాంరెడ్డి లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. కంటి వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 63 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 23 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ అపరేషన్ నిమిత్తం రాంరెడ్డి లయన్స్ ఐ ఆస్పత్రికి తరలించినట్లు పీఆర్‌వో పాషా తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రభుత్వ దవాఖాన వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ నరేందర్, జిల్లా చైర్మన్ యాదయ్య, కార్యదర్శి మహేశ్, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు, దవాఖాన హెచ్ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది వేణు పాల్గొన్నారు.

### ఉప్పల ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడ్తాల్ (తలకొండపల్లి), సెప్టెంబర్ 16 : ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్ అన్నారు. సోమవారం తలకొండపల్లి మండలంలోని లింగారావుపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నవారి కోసం గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. శిబిరంలో 189 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు అఖిల్, అనిల్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు యాదయ్య, నాయకులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


శిబిరంలో మందులు అందజేస్తున్న నాయకులు, ఉప్పల ట్రస్ట్ సభ్యులు